సాక్షి ఖమ్మం

గురువారం । 24 । ఆగస్టు । 2023



పచ్చదనం పరుచుకునేలా..

ప్రతీ పల్లె పచ్చగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విరివిగా మొక్కలు నాటుతోంది. 10లో



'బీసీ' కార్యాలయం ప్రారంభం

ఖమ్మంలో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. 12లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 25°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం ఆయన బార్ అసోసియేషన్ బాధ్యులతో సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మోటార్ వాహన ప్రమాద కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఇతర సివిల్ కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్మిక శాఖ అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న నష్టపరిహార కేసులను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించాలని న్యాయవాదులను కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదుల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్‌లో హవా



అథ్లెట్లను అభినందిస్తున్న సునీల్‌కుమార్ రెడ్డి, గౌస్

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా మిడిల్ డిస్టెన్స్ రన్‌లో ఖమ్మం అథ్లెట్లు హవా కొనసాగించారు. అండర్ –18 బాలుర 800 మీటర్ల విభాగంలో ఎస్.గోపీచంద్ ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకం దక్కించుకోగా, అండర్ –16 బాలుర విభాగంలో 800 మీటర్లలో కె.మస్తాన్ స్వర్ణ పతకం, అండర్–16 బాలికలలో డి.సాగరిక 800 మీటర్ల పరుగులో కాంస్య పతకం దక్కించుకున్నారు. జిల్లా అథ్లెట్లు జయకేతనం ఎగురవేయడం పట్ల డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ. గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్, కోశాధికారి ఎం.సుధాకర్, హలీం అభినందించారు.

పువ్వాడకు బ్రాహ్మణ సంఘం మద్దతు



మంత్రి పువ్వాడను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఖమ్మం నగర బ్రాహ్మణ సంఘం మద్దతు తెలిపింది. బుధవారం స్థానిక వీడీవోస్ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి పువ్వాడకు సంఘం నాయకులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాటూరు లక్ష్మీనారాయణ, మారంరాజు రాధాకృష్ణ, శ్రీకాంత్, నందుల వరలక్ష్మి, సుబ్బారావు, రావులపాటి శ్రీనివాసరావు, శనగపాటి మురళీకృష్ణ, అప్పారావు, వల్లూరు సత్యనారాయణ, ఎం.హరికిషన్‌రావు, వి.చంద్రశేఖర్, ఎస్ వి వాసు, బి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బదిలీల్లో స్వల్ప మార్పులు

ఖమ్మంమయూరిసెంటర్: రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు జరిగిన విషయం విదితమే. అయితే ఈ బదిలీల్లో ఆ శాఖ స్వల్ప మార్పులు చేస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ –1గా విధులు నిర్వహిస్తున్న అడపా రవీందర్‌ను ఎంవీ అండ్ ఆడిట్–1 రిజిస్ట్రార్‌కు బదిలీ చేసింది. ఎంవీ అండ్ ఆడిట్‌లో పని చేస్తున్న పి.యామినిని అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ సుజన్‌కుమార్‌ను ఎంవీ అండ్ ఆడిట్–2కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల దౌడ్!



గాంధీభవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మువ్వా విజయ్‌బాబు, కొండూరు సుధాకర్, ఇతర జిల్లాలకు చెందిన పొంగులేటి అనుచరులు

గాంధీభవన్‌కు పోటాపోటీగా ఆశావహులు

- ఈ నెల 25తో ముగియనున్న గడువు
- మూడు జనరల్ స్థానాలకు పొంగులేటి
- ఖమ్మం, పాలేరుకు మువ్వా దరఖాస్తు
- ఈ ప్రక్రియ పూర్తి చేసి టికెట్ కోసం వేట

సాక్షిప్రతినిధి,ఖమ్మం: కాంగ్రెస్ పార్టీలో దరఖాస్తుల దౌడ్ నెలకొంది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లాలోని ఆశావహులు గాంధీభవన్ బాట పట్టారు. ఈనెల 18 నుంచి టీపీసీసీ.. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఈ ప్రక్రియ 25తో ముగియనుంది. దీంతో ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇక ప్రక్రియ ముగిసిన వారంతా టికెట్ కోసం తమ ప్రయత్నాల్లో మునిగారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు పోటాపోటీగా దరఖాస్తులు చేశారు.

మూడింట పొంగులేటి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాలైన పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంలో ఎక్కడి నుంచి బరిలో ఉంటారన్నది రాజకీయ శ్రేణుల్లో ఆసక్తిగా మారింది. అయితే పొంగులేటి తరఫున ఆయన అనుచరులు మూడు స్థానాలకు బుధవారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. దీంతో మారుతున్న రాజకీయ సమీకరణలతో చివరకు ఆయన ఏ స్థానంలో ఉంటారన్నది త్వరలో తేలనుంది. అయితే పలు స్థానాలకు ఆయన అనుచరులు దరఖాస్తులు చేశారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు మువ్వా విజయబాబు, వైరా నియోజకవర్గం నుంచి విజయబాయి, సత్తుపల్లి నుంచి కొండూరు సుధాకర్, అశ్వారావుపేట నియోజకవర్గానికి జారె ఆదినారాయణ, పినపాకకు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందుకు భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దరఖాస్తులు అందజేశారు. అలాగే పొంగులేటి అనుచరులు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రఘునాథ్‌యాదవ్, చెన్నూరుకు డాక్టర్ రాజారమేష్, కంటోన్మెంట్‌కు పిడమర్తి రవి, మహేశ్వరం నియోజకవర్గానికి కొత్త మనోహర్‌రెడ్డి దరఖాస్తులు అందజేశారు.

ఈ రెండు రోజుల్లో ఇంకొన్ని..

దరఖాస్తు చేసుకుంటేనే టికెట్ల పరిశీలన జరుగుతుందన్న టీపీసీసీ ఆదేశాలతో ఆశావహులంతా గతంలో వారు చేసిన కార్యక్రమాలను వివరంగా పేర్కొంటూ దరఖాస్తు చేస్తున్నారు. ఈ నెల 25తో గడువు ముగియనుండడంతో ఆశావహులు మిగిలిన ఈ రెండు రోజుల్లో దరఖాస్తుల తంతు ముగించే పనిలో పడ్డారు. అయితే ముఖ్య నేతలు మాత్రం వ్యూహాత్మకంగా పలు చోట్ల తమ అనుచరులు ఇద్దరు, ముగ్గురితో దరఖాస్తులు చేయించడం గమనార్హం. టికెట్ల ప్రకటన నాటికి మారే రాజకీయ సమీకరణలతో ఏదైనా జరగొచ్చన్న ముందు చూపుతో ఈ విధంగా దరఖాస్తులు చేయిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో టికెట్ దక్కని ఆశావహులు కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారంతో.. కాంగ్రెస్‌లో ఆశావహులంతా ముందస్తుగా దరఖాస్తు చేసి టికెట్ల వేటలో పడ్డారు.

సర్వేలే కీలకం..

ఉమ్మడి జిల్లాలోని ముఖ్య నేతల అనుచరులు ఎవరికివారు దరఖాస్తు చేసినా.. ఈసారి సర్వేలను కీలకంగా చేసుకొని పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తుందని ఇప్పటికే పలుమార్లు టీపీసీసీ పెద్దలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సర్వేల్లో తమ పనితీరు ఎలా ఉందోనన్న ఆందోళన ఆశావహుల్లో ఉంది. ఇప్పటికే పలుమార్లు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్వే చేయించింది. ఇందులో ఆశావహుల్లో ఎవరు బెటర్, వారికి ప్రజలతో ఉన్న సత్సంబంధాలు తదితర వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ సర్వే ఆధారంగానే ఆశావహుల దరఖాస్తులను అన్ని కోణాల్లో పరిశీలించి అభ్యర్థిత్వం ఖరారు చేయనున్నట్లు సమాచారం. అధిష్టానం ప్రక్రియ ఎలా ఉన్నా దరఖాస్తు చేసిన ఆశావహులంతా టికెట్ తమకే ఇప్పించాలని తమ నేతల ఆశీస్సుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

వైరా, సత్తుపల్లికి పోటా పోటీ..

ఇప్పటి వరకు వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు ఆశావహులు ఎక్కువ మంది దరఖాస్తులు ఇచ్చారు. వైరా నియోజవర్గానికి దరఖాస్తు చేసుకున్న వారిలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు బానోతు బాలాజీ, మాలోతు రాందాస్‌నాయక్, రామ్మూర్తినాయక్, పాలకుర్తి నాగేశ్వరరావు ఉన్నారు. అలాగే సత్తుపల్లికి మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కోటూరి మానవతారాయ్, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, కొండూరు సుధాకర్, డాక్టర్ మట్టా దయానంద్, ఆయన భార్య రాగమయి దరఖాస్తు చేశారు. ఖమ్మంరూరల్ మండలం ఆరెంపుల సర్పంచ్ చింతమల్ల పద్మ, ఆమె భర్త చింతమల్ల రవి కూడా సత్తుపల్లి స్థానానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. పాలేరు నుంచి ఇప్పటివరకు మద్ది శ్రీనివాసరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్ దరఖాస్తులు ఇచ్చారు. రాయల నాగేశ్వరరావు నేడో, రేపో దరఖాస్తు చేయనున్నారు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన బెల్లం శ్రీనివాస్ కూడా దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. మధిర నియోజకవర్గానికి భట్టివిక్రమార్క తన దరఖాస్తును అనుచరులతో ఇప్పించనున్నారు.



నగరంలోని ఓ పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

జయహో చంద్రయాన్..

చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇస్రో శాస్త్రవేత్తల కృషిపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై అడుగిడే దృశ్యాన్ని ప్రతి ఒక్కరూ ఉత్కంఠగా తిలకించారు. ఎట్టకేలకు విజయవంతం కావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ అపురూప దృశ్యాలను వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా, శాస్త్రవేత్తలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. వివరాలు 11లో

చేయూతనిచ్చేందుకే పెన్షన్ పెంపు



దివ్యాంగుడికి పెన్షన్ చెక్కు అందజేస్తున్న మంత్రి అజయ్, కలెక్టర్ గౌతమ్

- రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: దివ్యాంగులకు మరింత చేయూత అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్‌ను రూ. 3016 నుంచి రూ. 4016కు పెంచిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. దివ్యాంగులకు అదనంగా పెంచిన పెన్షన్లను బుధవారం ఆయన భక్త రామదాసు కళాక్షేత్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.4016 పెన్షన్‌తో ఖమ్మం నియోజకవర్గంలో 5,522 మంది దివ్యాంగులకు ప్రతి నెల రూ.2.18 కోట్లు అందిస్తున్నామని, వారికి సామాజిక భద్రత కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. పెన్షన్ పొందుతున్నవారు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి వస్తుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత మానవీయ కోణంతో సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని, ఎవరూ అడగకపోయినా దివ్యాంగుల పెన్షన్ రూ.వెయ్యి పెంచారని చెప్పారు. కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో 1,91,691 మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ల కింద ప్రతి నెల రూ.44.48 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. వీరిలో 28,966 మంది దివ్యాంగులు పెన్షన్ పొందుతున్నారని వివరించారు. జిల్లాలో ప్రతినెల సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజల చెంతకు అభివృద్ధి ఫలాలు



రఘునాథపాలెంలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పువ్వాడ తదితరులు

రఘునాథపాలెం: అభివృద్ధి ఫలాలను ప్రజల చెంతకు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని, అందుకు ప్రతిఫలంగా గతం కంటే రెట్టింపు స్థాయిలో ఓట్లు వేసి ఘన విజయం అందించాలని మంత్రి అజయ్‌కుమార్ కోరారు. రఘునాథపాలెంలో రూ. 7 కోట్లతో నిర్మించే నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో రఘునాథపాలెం మండల సమగ్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయించి గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. గతంలో అర్బన్ మండలం కింద రఘునాథపాలెం ఉండేదని, గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేవని, తాను ఎమ్మెల్యేగా గెలిచాక పట్టుబట్టి నూతన మండలంగా ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలోని అన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. నగరాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. సుడా నిధులతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లను ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించినట్లు తెలిపారు. డొంక రోడ్లను సైతం రూ.4.50 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. అభివృద్ధితో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్‌డీఓ విద్యాచందన, డీడబ్ల్యూవో సుమ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, రఘునాథపాలెం ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, వైస్ ఎంపీపీ గుత్తా రవి, సర్పంచ్ గుడిపూడి శారద, ఆత్మ చైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, దిశా కమిటీ సభ్యులు మెంటం రామారావు నాయకులు మద్దినేని వెంకటరమణ, మందడపు నర్సింహారావు, వీరునాయక్, కుర్రా భాస్కర్‌రావు, మందడపు సుధాకర్, మాధవరావు, దొంతు సత్యనారాయణ, పగడాల నాగరాజు, మందా సంజీవరావు పాల్గొన్నారు.

శిక్షణకు పీటీసీ సిద్ధం

సీపీ విష్ణు ఎస్ వారియర్ వెల్లడి



ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం : స్టైపెండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ కోసం ఖమ్మం పోలీస్ శిక్షణ కేంద్రం పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధం చేశామని సీపీ విష్ణు ఎస్ వారియర్ తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక మండలి ద్వారా కొత్తగా కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ తుదిదశకు రావడంతో వీరికి శిక్షణ ఇచ్చేందుకు కేంద్రంలోని ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఇటీవలే పూర్తయిందని, కటాఫ్ మార్కుల ఆధారంగా తుది ఎంపిక తర్వాత శిక్షణకు పంపుతారని తెలిపారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు ఖమ్మం పీటీసీలో 250 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్రబోస్, సీఐ సర్వయ్య పాల్గొన్నారు.

త్రీటౌన్‌లో తనిఖీ

ఖమ్మం నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను సీపీ వారియర్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయో పరిశీలించి వాటి నియంత్రణపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా ఉండాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, పాత నేరస్తులను తనిఖీ చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

చంద్రయాన్ సక్సెస్‌లో ఖమ్మం వాసి



ఇస్రో కమాండ్‌సెంటర్‌లో ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఉమామహేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: చంద్రయాన్–3 విజయవంతం కావడంలో ఖమ్మానికి చెందిన శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు పాత్ర కూడా ఉండడంతో ఆయనతో పాటు కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్–3 ప్రాజెక్టులో ఉమామహేశ్వరరావు ఆపరేషన్ మేనేజర్‌గా వ్యవహరించారు. 2013లో ఇస్రో శాస్త్రవేత్తగా చేరి వివిధ స్థాయిల్లో పని చేశారు. బెంగళూరు కేంద్రంగా ఇస్రోలో ఆపరేషన్ డిజైనింగ్ విభాగంలో 1500 మందికి పైగా పని చేస్తుండగా.. ఆపరేషన్ మేనేజర్లుగా 30 మందిని ఎంపిక చేయగా వారిలో ఉమామహేశ్వరరావు కూడా ఉండడం విశేషం.

తుమ్మలను ఒప్పిద్దాం.. బరిలో నిలుపుదాం

- ఇక ఒక్క క్షణం కూడా పార్టీలో ఉండొద్దు
- నమ్మించి గొంతు కోశారు
- తుమ్మల వెంటే మా పయనం
- సత్తుపల్లి, మధిరలో అనుచరుల సమావేశం



సత్తుపల్లిలో మాట్లాడుతున్న కొత్తూరు ప్రభాకర్‌రావు



మధిరలో సమావేశమైన తుమ్మల వర్గీయులు

సత్తుపల్లి/మధిర : మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కష్టం వస్తే తమకూ వచ్చినట్టేనని, ఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో కొనసాగినా టికెట్ ఇవ్వకుండా మరింత అవమానించారని, ఎలాగైనా ఒప్పించి ఈసారి ఎన్నికల బరిలో నిలిచేలా చూద్దామని తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు తీర్మానించారు. బుధవారం సత్తుపల్లిలో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ.. తుమ్మలకు టికెట్ ఇవ్వకపోవడం బీఆర్‌ఎస్‌కే అవమానమని, తుమ్మలను వదులుకుంటే రాష్ట్రంలో 40 సీట్లు కూడా ఆ పార్టీకి రావని అన్నారు. ఇక బీఆర్‌ఎస్‌లో ఒక్క క్షణం ఉండొద్దని తుమ్మలను కోరారు. 'మీ వెంటే మేముంటా ఉంటామని' అన్నారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారం చేపట్టినా జిల్లాలో ఆ పార్టీ ఊసే లేకపోవడంతో సీఎం కేసీఆర్ తుమ్మల నాగేశ్వరరావును ఆహ్వానించి పార్టీలో చేర్చుకుంటే సేవకుడిలా పనిచేసి పార్టీని జిల్లాలోనే తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దారని, కొందరు ద్రోహుల వల్లే ఆయన పాలేరులో ఓటమి చెందారనే విషయం తెలిసినా ఇప్పుడు టికెట్ నిరాకరించటం తమను బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లాకు వస్తున్న తుమ్మలకు నాయకన్‌గూడెం వద్ద భారీగా స్వాగతం పలకాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో కొత్తూరు ప్రభాకర్‌రావు, చల్లగుళ్ల నర్సింహారావు, జక్కంపూడి కృష్ణమూర్తి, వెల్ది జగన్మోహన్‌రావు, సోమరాజు సీతారామారావు, డాక్టర్ కూసంపూడి నర్సింహారావు, వేంసూరు, బేతుపల్లి సర్పంచ్‌లు ఎండి ఫైజుద్దీన్, శ్రీనివాసరావు, ఎంపీటీసీ విస్సంపల్లి వెంకటేశ్వరరావు, రాచూరి గంగరాజు, జ్యేష్ట అప్పారావు, గోదా రాములు, వెలిశాల చెన్నాచారి, అంజిరెడ్డి, వినుకొండ కృష్ణ, అలవాల కరుణాకర్, తేళ్లూరి ఆడమ్స్ పాల్గొన్నారు.

మధిరలో..

తుమ్మల నాగేశ్వరరావు రాజకీయపరంగా ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని ఆయన అనుచరులు మాదల రామారావు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మొండితోక సుధాకర్ తదితరులు అన్నారు. మధిరలో బుధవారం సమావేశమైన వారు మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా జిల్లా అభివృద్ధి కోసం తుమ్మల ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆంధ్ర సరిహద్దులో ఉన్న ఈ జిల్లాలో తుమ్మల చేరిక తర్వాతే బీఆర్‌ఎస్ బలోపేతం అయిందన్నారు. ఎంతో అనుభవం కలిగి, జిల్లా అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన తుమ్మలకు టికెట్ కేటాయించకపోవడం దుర్మార్గమని తెలిపారు. సమావేశంలో గుర్రం వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత పనులపై దృష్టి సారించండి

కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్ : ప్రాధాన్యత గల పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతో గృహలక్ష్మి, జీవో 59, లేఔట్‌ల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో 1090, మధిరలో 1327, వైరా మున్సిపల్ పరిధిలో 1351 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో కనీసం 10 శాతం దరఖాస్తులను సూపర్ చెక్ కింద స్వయంగా కమిషనర్లు పరిశీలించాలని ఆదేశించారు. అర్హత గల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఫొటోలు, జీపీఎస్ మ్యాపింగ్ చేయాలన్నారు. మున్సిపాలిటీల వారిగా లేఔట్ దరఖాస్తులు, ప్లాట్ల వివరాలు సమీక్షించారు. సెప్టెంబర్ కల్లా క్షేత్ర పరిశీలన పూర్తి చేయాలన్నారు. జీవో 59 కింద రెండో విడత డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. మొదటి విడత డిమాండ్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మున్సిపాలిటీలకు కేటాయించిన వీఆర్వో, వీఆర్‌ఏలకు వార్డులు కేటాయించి, విధులు అప్పగించాలని అన్నారు. సమీక్షలో సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సుజాత, రమాదేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సిద్ధం చేయాలి



వైద్య కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంవైద్యవిభాగం: మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి నెలాఖరులోగా అంతా సిద్ధం చేయాలని కలెక్టర్ వి.పి గౌతమ్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన మెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. పనులు ఎంత వరకు వచ్చాయి, ఇంకా ఏమేం చేయాలని కళాశాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులు చేరారని ఆరా తీశారు. వసతి గదుల్లో పార్టేషన్ పనులు చేపట్టాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి, తెలుగు రాష్ట్రాల విద్యార్థులను విడివిడిగా ఉంచేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బాలుర వసతిగృహం పనులు జాప్యం అవుతున్నాయని చెప్పడంతో కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడారు. ఈ నెలాఖరు నాటికి పనులను పూర్తి చేసి సర్వం సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఈఈ ఉమామహేశ్వర్‌రావు, డీఈ శ్రీనివాస్, కళాశాల హెచ్‌ఓడీలు ఉన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కృతజ్ఞతలు

ఖమ్మంవైరారోడ్‌: రాష్ట్రంలో రైతులను రాజును చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ అహర్నిశలు కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబంధు సాయం అందించడంతో పాటు రుణమాఫీ చేసిన సీఎంకు జిల్లా రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మాట తప్పని గొప్ప నాయకుడు కేసీఆర్‌ అని పేర్కొన్నారు. సమాజానికి అన్నం పెట్టే రైతుకు అండగా నిలవాలన్నదే ఆయన అభిమతమని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన బొడ్డు ప్రసాద్‌

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ గ్రామ ఉప సర్పంచ్‌కు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ముజ్జుగూడెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌ బొడ్డు ప్రసాద్‌ బుధవారం మండల కేంద్రం నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు బైక్‌ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

స్కూల్‌ బస్సుకు తప్పిన ప్రమాదం

ఖమ్మంక్రైం : నగరంలో ఓ ప్రైవేట్‌ పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో దాదాపు 30 మంది విద్యార్థులు ఉన్నారు. కరుణగిరికి చెందిన ప్రైవేట్‌ స్కూల్‌ పిల్లలను గాంధీ సినిమా చూపించడానికి నగరంలోని ఓ సినిమా థియేటర్‌కు తీసుకొస్తుండగా సినిమా హాల్‌ ముందుకు రాగానే డ్రైవర్‌ బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో పక్కనున్న సైడ్‌ కాలువలో టైర్లు ఇరుక్కుపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



యాచకుడి మృతదేహం

పెనుబల్లి: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలంలోని మండాలపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. మండాలపాడు పరిసర ప్రాంతాల్లో నెల రోజులుగా భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం తెల్లవారుజామున గ్రామంలోని దాబా సమీపంలో మృతి చెంది ఉన్నాడని స్థానికులు గుర్తించారు. వీఎం బంజర్‌ పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్‌ఐ సూరజ్‌ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో చెయిన్‌ స్నాచర్‌

వైరా: స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా పనిచేస్తున్న ఉదయలక్ష్మి మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా దుండగుడు ఆమె మెడలో నుంచి సుమారు 4.5 తులాల బంగారు గొలుసు చోరీ చేసిన విషయం విదితమే. బుధవారం తెల్లవారుజామున ఖమ్మం సమీపంలో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు సదరు నిందితుడు చిక్కాడు. నిందితుడిని ఖమ్మానికి చెందిన ఎల్‌.శేఖర్‌గా గుర్తించి వైరా పోలీసులకు అప్పగించారు. అతడి వద్ద నుంచి చోరీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని విచారణ చేపడుతున్నారు.

మోటార్ల వైరు చోరీ

వేంసూరు: మండలంలోని భీమవరంలో వ్యవసాయ మోటార్ల విద్యుత్‌ సర్వీస్‌ వైర్లను చోరీ చేశారు. బాధితుల కథనం ప్రకారం.. ఎనిమిది మంది రైతులకు చెందిన మోటార్లకు సంబంధించి 300 మీటర్ల వైరును గుర్తుతెలియని దుండగులు కత్తిరించుకుని వెళ్లారు. ఈ ఘటనపై బాధితులు అక్కినేని మురళి, ముక్కేశ్వరరావు, నున్నా సత్యనారాయణ, వలసపల్లి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇళ్ల నిర్మాణంలో ఇరువర్గాల ఘర్షణ

పాల్వంచరూరల్‌: మండలంలోని బస్వతారక కాలనీ సమీపంలో గల భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం ఇరువర్గాల వారు బుధవారం ఘర్షణ పడ్డారు. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ రామును వివరణ కోరగా ఇళ్ల నిర్మాణం విషయంలో గొడవ జరుగుతున్నట్లు సమాచారం రాగా తాను ఘటనా స్థలానికి వెళ్లానని, అక్కడి నుంచి ఇరువర్గాల వారు పారిపోయారని తెలిపారు. భూతగాదా విషయమై విచారణ జరుపుతున్నామని, ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ వివరించారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.13,091

పచ్చదనం పరుచుకునేలా..

- వజ్రోత్సవాల ముగింపురోజే 5.60 లక్షల మొక్కలు నాటే లక్ష్యం
- పంచాయతీలు, మున్సిపాలిటీలకు టార్గెట్‌ అదే..
- ఈ నెల 26న హరితహారానికి శ్రీకారం

నేలకొండపల్లి: ప్రతీ పల్లె పచ్చగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ చర్యలు చేపడుతోంది. మధ్యమధ్యలో పెద్దఎత్తున నాటేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో 5.60 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం పెట్టుకున్నారు.

ప్రతీ పంచాయతీలో 750 నుంచి 1000 వరకు..

ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలకు లక్ష్యం నిర్దేశించారు. కనీసం 750 నుంచి 1000 మొక్కలు నాటేందుకు కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతీ పంచాయతీతో పాటు మున్సిపాలిటీల్లో ఇలా మొక్కలు నాటాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లో ఖాళీ స్థలాలు, ప్రైవేట్‌ సంస్థలకు చెందిన స్థలాలు, రోడ్ల పక్కన నాటనున్నారు. పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు.



నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన నర్సరీలోని మొక్కలు

అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు..

ఈ నెల 26న సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులను ప్రభుత్వం బాధ్యులను చేసింది. ప్రతీ శాఖకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించి, అందుకనుగుణంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యవసాయం, విద్య, డీఆర్‌డీఓ, ఎక్సైజ్‌, ఫారెస్ట్‌, ఉద్యానవన, పరిశ్రమలు, ఇరిగేషన్‌, మైనింగ్‌, మున్సిపల్‌, సింగరేణి సంస్థల అధికారులకు లక్ష్యాన్ని విధించారు. దీంతో ఆయా శాఖల అధికారులు మొక్కల గుంతలను తీసే పనిలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా డీఆర్‌డీఓ, మున్సిపల్‌, అటవీ శాఖలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఎంపీడీఓల ద్వారా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే స్థలాలను గుర్తించే ప్రక్రియను పూర్తి చేశారు.

26న మొక్కలు నాటాలి..



జిల్లా లక్ష్యం 5.60 లక్షల మొక్కలు నాటడం. ఈ నెల 26న మొదలయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పంచాయతీలో 750 నుంచి 1000 మొక్కలు నాటేలా చూడాలి. ఎంపీడీఓలు పర్యవేక్షించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములు చేయాలి. సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

–సిద్దార్థ్‌ విక్రమ్‌సింగ్‌,
జిల్లా అటవీ శాఖ అధికారి, ఖమ్మం

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య



వెంకటాచారి(ఫైల్‌)



సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

కూసుమంచి : పాఠశాలకు వెళుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని గుర్తు తెలియని దుండగులు అడ్డగించి గొడ్డళ్లతో మెడపై నరికి హత్య చేసిన ఘటన కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారోజు వెంకటాచారి (49) సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. నాయకన్‌గూడెం నుంచి పాఠశాలకు బైక్‌పై వెళుతూ హత్యకు గురయ్యాడు.

కారుతో బైక్‌ను ఢీకొట్టి..

వెంకటచారి బైక్‌ పై వెళుతుండగా నాయకన్‌గూడెం శివారులో కారులో వచ్చిన గుర్తు తెలియని దుండగులు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో వెంకటాచారి కిందపడగా కారులోని వారితో పాటు ద్విచక్ర వాహనంపై వచ్చిన మరో వ్యక్తి అతని మెడపై గొడ్డలితో నరికి పరారైనట్లు స్థానిక రైతులు తెలిపారు. ఎరుపు రంగు కారు, దాని వెనకే బైక్‌ రావడం సీసీ ఫుటేజీల్లోనూ కనిపించడంతో వారే హత్య చేసి ఉంటారని పోలీసులు కూడా చెబుతున్నారు. అయితే హత్యకు గల కారణాలు తెలియలేదు. వెంకటాచారి రెండేళ్ల క్రితం నాయకన్‌గూడెంలో ఓ ప్రైవేటు పాఠశాలను నిర్వహించగా దాన్ని ప్రస్తుతం నడపటం లేదు. ఆ భవనాలను గురుకుల పాఠశాలకు అద్దెకు ఇచ్చాడు. దీంతో ఆర్థిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఖమ్మంరూరల్‌ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ జితేందర్‌రెడ్డి , ఎస్సై రమేష్‌కుమార్‌ పరిశీలించారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని, దుండగులు పరారు కావడంతో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని సీఐ తెలిపారు. వెంకటాచారి కుటుంబసభ్యులు కూడా ఎవరిపై అనుమానాలు వ్యక్తం చేయలేదన్నారు.

చీడ, పీడల నివారణ చర్యలు చేపట్టాలి



ఎదుళ్లచెరువులో పత్తి పంట పరిశీలిస్తున్న డీఏఓ సరిత

తిరుమలాయపాలెం: పత్తి పంటలో వచ్చే చీడ పీడల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి సరిత అన్నారు. బుధవారం మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో రసం పీల్చు పరుగుల ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు కాండం పై మోనోక్రొటోపాస్‌, ఇమిడాక్లోపిడ్‌ అనే మందుని పూయాలని చెప్పారు. గులాబీ పురుగుల ఉధృతి కూడా ప్రారంభమైందని గుర్తించామని.. ముందు జాగ్రత్తగా వేపనూనే, ప్రొఫినోపాస్‌ మందులను పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మిరపలో వేరు కుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లు సోకుతున్నాయని వాటి నివారణకు కాపర్‌ఆక్సిక్లోరైడ్‌, థయోఫినాక్సీమిథైల్‌ (రోకో) మందులను, ట్రైకోడర్మావిరిడి మందులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సీతారాంరెడ్డి ఏఈఓ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బైక్‌ చోరీ కేసులో విచారణ

భయంతో గొంతు కోసుకున్న అనుమానితుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగార్జున

పెనుబల్లి: అన్నపురెడ్డిపల్లి పోలీసులు బైక్‌ చోరీ కేసు విచారణ నిమిత్తం మండలంలోని పాతకారాయిగూడెం వచ్చి అనుమానితుడిగా భావిస్తున్న నాగార్జున ఇంటికి వెళ్లారు. దీంతో సదరు వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాతకారాయిగూడెం గ్రామానికి చెందిన కొమ్మినేని రామకృష్ణ అలియాస్‌ నాగార్జున ద్విచక్రవాహనాలను చోరీ చేశాడేమోననే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి పోలీసులు అనుమానించారు. ఎస్‌ఐ షాహీనా సిబ్బందితో సివిల్‌ డ్రెస్సులో మంగళవారం రాత్రి పెనుబల్లి మండలంలోని పాతకారాయిగూడెంలో నాగార్జున ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, నాగార్జున కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నాగార్జున ఇంట్లోకి వెళ్లి బ్లేడుతో గొంతు వద్ద కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే నాగార్జునను కుటుంబ సభ్యులు, స్థానికులు పెనుబల్లి వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగార్జున పరిస్థితి నిలకడగానే ఉంది.

చలానా ఆధారంగా..

పెనుబల్లి మండలంలోని కుప్పెనకుంట్లకు చెందిన నారుమళ్ల రవీంద్ర ఏప్రిల్‌ 2న తన ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని ఉంచి ఇంట్లోకి వెళ్లి భోజనం చేస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. తర్వాత ఆ ద్విచక్రవాహనంపై ఎర్రగుంటలో ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ ఉండగా పోలీసులు ఆ ద్విచక్రవాహనం ఫొటో తీసి చలానా వేశారు. రవీంద్ర సెల్‌ఫోన్‌కు ఎర్రగుంటలో తన ద్విచక్రవాహనానికి చలానా వేసిన ఫొటో రావడంతో ఈ నెల 18న ఆ ఫొటో ఆధారంగా వెళ్లి ఆ వ్యక్తిని గుర్తించాడు. ఎర్రగుంటకు చెందిన చెన్నారావు అనే వ్యక్తి తాను ద్విచక్రవాహనాన్ని పాతకారాయిగూడెం వ్యక్తి వద్ద నుంచి కుదవపెట్టుకున్నానని, తాను దొంగతనం చేయలేదని, ఆ వాహనాన్ని అన్నపురెడ్డిపల్లి పోలీసులకు అప్పగించాడు. అక్కడి నుంచి వీఎం బంజర్‌ పోలీసుల జోక్యంతో రవీంద్రకు అన్నపురెడ్డిపల్లి పోలీసులు ద్విచక్రవాహనాన్ని అప్పగించారు. కాగా, అన్నపురెడ్డిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గుంపెనలో రెండు ద్విచక్రవాహనాలు, సామగ్రి దొంగతనం కేసులు పెండింగ్‌లో ఉండటంతో వాటిని ఏమైనా పాతకారాయిగూడెం గ్రామానికి చెందిన నాగార్జున దొంగిలించాడేమోనన్న అనుమానంతో ఎస్‌ఐ షాహీనా మంగళవారం రాత్రి విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే నాగార్జున బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీఎం బంజర్‌ ఎస్‌ఐ సూరజ్‌ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర వైద్య బృందం

బోనకల్‌: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య బృందం బుధవారం సందర్శించింది. బోదకాలు నివారణ మందులను పంపిణీని పరిశీలించింది. ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారితో పాటు సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రోగ్రాం వివరాలను బృందంలోని సభ్యులు అడిగి తెలుసుకున్నారు. డ్రగ్‌ స్టోర్‌, ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షలు, లేబర్‌ రూంను తనిఖీ చేశారు. పైలేరియా, డెంగీ కేసుల వివరాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య బృందం డాక్టర్‌ పర్వీన్‌సుల్తానా, జిల్లా మలేరియా వైద్యాధికారి లక్ష్మీనారాయణ, నరసింహారావు, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్ల సందడి



కళాశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం నూతన మెడికల్‌ కళాశాలలో అడ్మిషన్ల సందడి మొదలైంది. మంగళవారం తొలి అడ్మిషన్‌ జరగగా ఇద్దరు విద్యార్థులు చేరారు. బుధవారం కూడా కళాశాలలో చేరేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వచ్చారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా రావటంతో కళాశాల అడ్మిషన్‌ విభాగంలో సందడి నెలకొంది. నలుగురు విద్యార్థులు చేరటంతో మొత్తం విద్యార్థుల సంఖ్య 6కు చేరింది. నేషనల్‌ కోటాలో 15 సీట్లు కేటాయించగా రెండు, మూడు రోజుల్లో ఆ కోటా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయి సీట్లకు కూడా అడ్మిషన్లు నిర్వహించనున్నారు. త్వరలోనే కేటాయించిన 100 సీట్లు భర్తీ అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్‌ రాజేశ్వరరావు పేర్కొన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.1.50 లక్షలు టోకరా

- రెండు నెలలు వెట్టిచాకిరీ..
- జీతం లేదు.. ఇచ్చిన డబ్బులు లేవు..

నేలకొండపల్లి: ఉద్యోగం వస్తుందని భావించి రూ.1.50 లక్షలను ఓ సంస్థకు అప్పగించగా.. సదరు సంస్థ మోసం చేసిన ఘటన మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన నంది గామ శ్రుతికి ఈ ఏడాది మార్చిలో హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్‌ సంస్థ బాధ్యులమని చెప్పి కొందరు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. స్థానిక మండలంలోనే ఉద్యోగమని, నెలకు రూ.16,500 వేతనం అని తెలిపారు. అందుకు ఆమె వద్ద నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నారు. నేలకొండపల్లి డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌గా పోస్టింగ్‌ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు తిరిగి మొక్కల గురించి వివరించడం ఆమె విధి. రెండు నెలలు చేసింది. కానీ, ఒక్క రూపాయి వేతనం కూడా ఇవ్వలేదు. బాధిత యువతి వేతనం కోసం ఆఫీస్‌ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. చివరికి తాను ఉద్యోగం చేయలేనని, తాను చెల్లించిన డబ్బులు ఇవ్వమని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని వాపోయింది. తన కుటుంబంలో తల్లి లేదని, తండ్రి, తాను కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఉద్యోగం కోసం తెచ్చిన అప్పులు వడ్డీలకువడ్డీలు పెరిగిపోతున్నాయని కన్నీటి పర్యంతమైంది. ఖమ్మం పోలీసులకు సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపింది.

ద్విచక్రవాహనం దగ్ధం



దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

పెనుబల్లి: చర్చి ఎదుట ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటన పెనుబల్లి మండలంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వీఎం బంజర్‌లోని బైబుల్‌ మిషన్‌ చర్చి పాస్టర్‌ బేతంపూడి రాకడరాజ తన పల్సర్‌ బైక్‌ను చర్చి ముందు పార్కు చేసి పక్కనే ఉన్న తన ఇంట్లో పడుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున బైక్‌ దగ్ధం అవుతోందని చుట్టుపక్కల వారు గమనించి చెప్పడంతో రాజా లేచి చూశాడు. దీంతో రాజా వీఎం బంజర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ జి.సూరజ్‌ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేయడంతో అతడిని పిలిచి పోలీసులు విచారించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ సూరజ్‌ తెలిపారు.

కొండచిలువ కలకలం



కృష్ణయ్య ఇంట్లో ఉన్న కొండచిలువ

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామంలో కొండచిలువ కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నారానికి చెందిన కృష్ణయ్య ఇంట్లోకి బుధవారం కొండచిలువ వచ్చింది. మంచం కింద ఉండి ఎలుకను మింగి ఉండటంతో బాధితుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించటంతో వారు అక్కడికి చేరుకుని కొండచిలువపై దాడి చేశారు. కానీ, అది తప్పించుకుని వెళ్లడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

జ్వరంతో యువకుడు మృతి



ప్రేమ్‌కుమార్‌ (ఫైల్‌)

కామేపల్లి(కారేపల్లి): జ్వరంతో గిరిజన యువకుడు మృతి చెందిన ఘటన కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన లకావత్‌ బాలు – శాంతి దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్‌ (23) బీటెక్‌ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఖమ్మంలోని ఓ కోచింగ్‌ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. తోటి స్నేహితులతో కలిసి రూం అద్దెకు తీసుకొని అక్కడే ఉంటున్నాడు. వారం రోజుల కిందట ప్రేమ్‌కుమార్‌కు జ్వరం రావటంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు తీవ్ర అస్వస్థతకు గురైన ప్రేమ్‌కుమార్‌ స్పృహతప్పి కింద పడిపోవటంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమించటంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు.

ఆస్తి ఇవ్వడం లేదని వ్యక్తి ఆత్మహత్య

చండ్రుగొండ: కులాంతర వివాహం చేసుకున్న కారణంగా కుటుంబ సభ్యులు ఆస్తి పంపకాల విషయంలో తనకు వాట ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగయ్యబంజర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగయ్యబంజర్‌ గ్రామానికి చెందిన పూరేటి శివ (35) పదిహేనేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన బానోత్‌ విజయను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్నాడనే అక్కసుతో కుటుంబ సభ్యులు ఆస్తిలో వాటా ఇవ్వమని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన అతడు బుధవారం పురుగులమందు తాగాడు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు తల్లి మంగమ్మ, సోదరుడు నరేశ్‌, మేనమామ మేకల సుబ్బారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులో వ్యక్తి ఆత్మహత్య

చండ్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామానికి చెందిన ఆళ్ల మల్లేశ్‌ (28) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగులమందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించే మల్లేశ్‌ ఇటీవలికాలంలో అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్‌

చర్ల: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో వివిధ కేడర్లలో ఉన్న 14 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట బుధవారం లొంగిపోయారు. జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయ్‌ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలో మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిపేందుకు ఏర్పాటు చేసిన లోన్‌ వర్రోట్‌ (ఇంటికి తిరిగి రండి) కార్యక్రమానికి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 629 మంది మావోయిస్టులు లొంగిపోగా వారిలో రివార్డులు ఉన్న 161 మంది ఉన్నారని, తాజాగా 14 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎస్పీ వివరించారు.

మాజీ సర్పంచ్‌ను గాయపరచిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని బీజాపూర్‌ జిల్లాలో గత ఆదివారం రాత్రి 40 మందిని అదుపులోకి తీసుకున్న మావోయిస్టులు వారిలో 39 మందిని మరుసటి రోజు విడిచిపెట్టగా కుట్రు మాజీ సర్పంచ్‌ మహేశ్‌కుమార్‌ గోటాను మాత్రం వదిలిపెట్టలేదు. పోలీస్‌ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ తీవ్రంగా కొట్టారు. పదునైన ఆయుధాలతో గాయపరచారు. మంగళవారం రాత్రి సోమనపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన పడేశారు. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో అతడిని బీజాపూర్‌ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాయ్‌పూర్‌కు.. అక్కడి నుంచి బుధవారం సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఢిల్లీకి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.



మూన్ గురించి..
మీకు తెలుసా?

➤ మనం అనుకున్నట్లు.. చంద మామ గుండ్రంగా ఉండడు.. గుడ్డు ఆకారంలో ఉంటాడు.. అలాగే చల్లనయ్య.. తెల్లనయ్య కాదు.. దగ్గర్నుంచి చూస్తే.. ముదురు బూడిద రంగులో ఉంటాడు. మనం ఎప్పుడు చూసినా.. చంద్రునిలోని 59 శాతం మాత్రమే మనకు కనిపిస్తుందట. అంతేకాదు.. చంద్రుడిని దగ్గర నుంచి చూస్తే.. భారీ గుంతలులాంటివి కనిపిస్తుంటాయి. ఇవన్నీ.. కొన్ని కోట్ల ఏళ్ల క్రితం ఖగోళ వస్తువులు దాన్ని ఢీకొన్నప్పుడు ఏర్పడినవే..



ఆన్‌లైన్‌లో 'అగ్రి' సెన్సెస్

- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వ్యవసాయ గణన షురూ
- ఇతర రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే...
- మన దగ్గరే యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతుల జీవన స్థితిగతులు..సాగు కమతాల స్వరూప స్వభావాన్ని తేల్చే వ్యవసాయగణన (అగ్రికల్చర్ సెన్సెస్) ఇటీవల దేశవ్యాప్తంగా మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. భూకమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం పది అంశాలపై మూడు దశల్లో వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా కాగిత రహితంగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు వినియోగించి ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో ఏఈఓలు సర్వే చేస్తుండగా, మిగతా రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే చేపడుతున్నారు.

2021–22 ప్రామాణికంగా 11వసారి

దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్రం ఐదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన నిర్వహిస్తోంది. 1979లో వ్యవసాయగణన మొదలుకాగా, చివరగా పదోసారి 2015–16లో చేపట్టారు. 11వ వ్యవసాయ గణన 2021–22లో జరగాల్సి ఉండగా, కరోనా తదితర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. 2021–22 ప్రామాణిక సంవత్సరంగా ఈ నెల నుంచి వ్యవసాయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లంలో సర్వే చేస్తున్న ఏఈఓ

మూడు దశల్లో...

వానాకాలం, యాసంగిలో ఆయా రైతుల వారీగా ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలో ఏటా వ్యవసాయశాఖ సర్వే చేస్తోంది. అయితే కేంద్రం మార్గదర్శకాల ప్రకారం మూడు విడతల్లో వ్యవసాయ గణన చేపట్టారు.

- మొదటి విడతలో రైతు పేరు, సామాజికస్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం, పురుషులు, మహిళలు ఇలా అన్ని సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తున్నారు.
- రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో ప్రణాళిక శాఖ నిర్దేశించిన టీఆర్‌ఏఎస్ (టైమ్ లీ రిపోర్టెడ్ అగ్రి స్టాటిస్టిక్స్)తో పాటు అదనంగా మరికొంత సమాచారం సేకరిస్తారు.
- మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వివరాలు సేకరిస్తారు.

సాంకేతికతతో సర్వే...

తాజాగా రాష్ట్రంలో చేపట్టిన వ్యవసాయ గణనలో అధికారులు వందశాతం సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వ్యవసాయ కమతాలు, రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రైతుబంధు పథకానికి రైతుల నుంచి ఆధార్ కార్డులు, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పంటల సాగు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచగా, వాటి ఆధారంగా వ్యవసాయగణనలో అదనపు సమాచారం తీసుకుంటున్నారు.

ప్రణాళికకు వ్యవసాయ గణన కీలకం



వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు ఆర్థిక విధాన రూపకల్పనకు వ్యవసాయ గణన ఎంతో ఉపయోగకరం. నిర్ణీత లక్ష్యం మేరకు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ, ప్రణాళిక శాఖ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

– దశరథ్, మహబూబ్‌నగర్ జిల్లా ప్రణాళికశాఖ అధికారి

ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వ్యవసాయ గణన చేయిస్తున్నాం. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పథకాలకు అనుగుణంగా ఈ పంటల వివరాల లెక్కల సేకరణ జరుగుతోంది. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తి చేస్తాం.

– బి.వెంకటేష్, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి

ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత

- అనారోగ్యంతో అమెరికాలో తుదిశ్వాస
- గణిత శాస్త్రంలో నోబెల్‌కు సమానమైన అవార్డును అందుకున్న సీఆర్ రావు
- పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన భారత ప్రభుత్వం



ఏయూ క్యాంపస్/దాబాగార్డెన్స్: ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 1920 సెప్టెంబర్ 10న కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో కల్యంపూడి రాధాకృష్ణా రావు (సీఆర్ రావు) తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఏపీలోని గూడూరు, నూజివీడు, నంది గామల్లో ఆయన బాల్యం గడిచింది. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1940లో ఏయూలో గణిత శాస్త్రం అభ్యసించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇండియన్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. అక్కడ పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడి అక్కడ యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే ఇంటర్నేషనల్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటస్టిక్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1968లో పద్మభూషణ్, 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఎస్ఎస్ భట్నాగర్ పురస్కారాన్ని కూడా సీఆర్ రావు అందుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 10న 100వ పుట్టినరోజును జరుపుకున్నారు.

స్టాటస్టిక్స్‌లో నోబెల్ అంతటి గౌరవం

సీఆర్ రావుకు 75 ఏళ్ల కిందట గణాంక రంగంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు గాను ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటస్టిక్స్–2023 అవార్డును అందజేశారు. 102 ఏళ్ల వయసులో ఈ ఏడాదే ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 1945లో కోల్‌కతా మ్యాథమెటికల్ సొసైటీలో ప్రచురితమైన సీఆర్ రావు పరిశోధన పత్రానికి ఈ అవార్డు దక్కింది. ఆయన చేసిన కృషి..ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటస్టిక్ ఫౌండేషన్ తెలిపింది.

ఎన్టీపీసీ రెండోయూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం

100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసిన యూనిట్



జ్యోతినగర్ (కరీంనగర్): ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుతో రాష్ట్రానికి మరిన్ని వెలుగులు ప్రసరించనున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రాజెక్ట్‌లోని 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే రెండోయూనిట్ బుధవారం ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు, జనరల్ మేనేజర్లు అతుల్ కమలాకర్ దేశాయ్, అనుపమ్ ముఖర్జీ, మోహన్‌రెడ్డి, సంతోశ్ తివారీ, అర్పన్‌దాస్ గుప్తా, సీనియర్ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. రెండో యూనిట్ సింక్రనైజేషన్ విజయవంతంగా పూర్తికావడంతో వీరంతా అభినందనలు తెలుపుకున్నారు. కాగా, ప్రారంభమైన విద్యుదుత్పత్తి రెండో యూనిట్ తొలిరోజే 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది.

మార్చిలో తొలి యూనిట్ సింక్రనైజేషన్: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్‌ను ఈ ఏడాది మార్చి 24న సింక్రనైజేషన్ చేశారు. మొదటగా 104.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. జూలై 23న పూర్తిస్థాయిలో 801.2 మెగావాట్ల ఉత్పత్తికి చేరుకుంది. 72 గంటల నిరంతర విద్యుదుత్పత్తి అనంతరం గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా ట్రాన్స్‌కోలోని లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎల్డీసీ) నుంచి స్లాట్లను పొందింది.

మహిళా రిజర్వేషన్లు నా ఇంటి సమస్య కాదు

మహిళా హక్కులపై 'కాంగ్రెస్' బీజేపీది ఒకే వైఖరి: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల అంశం తన ఇంటి సమస్య కాదని.. ఇది దేశ మహిళలకు సంబంధించినదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద తాను ధర్నా చేసినప్పుడు కలిసిరాని పార్టీలు, నాయకులు ఇప్పుడు స్పందించడం మహిళా బిల్లు ప్రాధాన్యతను తెలియజేస్తోందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. చట్టం ద్వారానే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని, అయితే మహిళల హక్కులపై కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014 వరకు అధికారంలో ఉన్నా లోక్‌సభలో ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. పదేళ్లుగా మహిళాబిల్లుపై ప్రధాని మోదీని కాంగ్రెస్ నేతలు సోనియా, ప్రియాంక ఎందుకు నిలదీయలేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మరోమారు తాను ఢిల్లీ జంతర్‌మంతర్‌లో చేసే ధర్నాకు సోనియా, ప్రియాంకతోపాటు కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కూడా ఆహ్వానిస్తానని ప్రకటించారు.

70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం

మహిళాబిల్లు ఆమోదం పొందకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా అవహేళనగా మాట్లాడారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో రాకేశ్ శర్మ, కేఆర్‌పీ రెడ్డి, హర్మస్జి కామ, మేరీ పాల్

హైదరాబాద్‌లో ఐఎన్‌ఎస్ సమావేశం


సాక్షి, హైదరాబాద్: భారత పత్రికల సమాఖ్య (ఐఎన్‌ఎస్) సదస్సు పదిహేనేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సమాఖ్య అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. పత్రిక పరిశ్రమకు ఐఎన్‌ఎస్ అపెక్స్ కో ఆర్డినేషన్ సంస్థగా పనిచేస్తూ.. పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించి, వాటిని పరిష్కరించడం, అవసరమైన వాటిని ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకొని వెళ్తుంది. బుధవారం జరిగిన సదస్సులో కేఆర్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్‌శర్మ, సెక్రెటరీ జనరల్ మేరీ పాల్, అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హర్మస్జి కామ, రీజినల్ అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ స్థానిక అక్రెడిటెడ్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు, స్థానిక ఐఎన్‌ఎస్ పబ్లికేషన్‌తో సంప్రదింపులు జరిపి వారి నుంచి పలు అంశాలపై సమాచారం సేకరించారు. జీఎస్టీ, వాణిజ్య, ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రకటనల చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నట్లు కేఆర్‌పీ రెడ్డి తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన



ఖమ్మంమయూరి సెంటర్/సూపర్‌బజార్ (కొత్తగూడెం): రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు రామవరంలో మల్టీ యుటిలిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. 11 గంటలకు కొత్తగూడెం యూనియన్ బ్యాంక్ నుంచి రైతు బజార్ వరకు నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. 11.15 గంటలకు పాల్వంచ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడతారు. మధ్యాహ్నం 12 గంటలకు నవభారత్‌లోని ఐడీఓసీలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామకపత్రాలు అందజేస్తారు. జీవో 58 కింద లబ్ధిదారులకు పట్టాలను, ఎస్సీ వెల్ఫేర్ కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. దివ్యాంగులకు పెంచిన ఆసరా పెన్షన్లను అందజేస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని శ్రీనివాసనగర్‌లోని సీపీ కార్యాలయంలో హైమాస్ట్ ఫ్లాగ్ పోల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఖమ్మం పోలీస్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తారు. అలాగే వరదల సమయంలో పనిచేసిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్ తిలక్‌నగర్‌కు చెందిన భక్తులు కె.ప్రశాంత్ భరద్వాజ్ బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కు ఆలయ అధికారులకు అందించగా వారు రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల దారుణాలు

- పంట రుణాల పేరిట యథేచ్ఛగా వడ్డీ దందా
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- సాధారణ విషయంగా తీసుకుంటున్న బ్యాంకర్లు





బ్యాంకులో వినియోగదారులు (ఇన్‌సెట్) దళారీ వద్ద విత్‌డ్రా ఫారాలు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి వెంటాడుతున్నా అన్నదాతలు భారం దేవుడిపైనే వేసి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలించక కొందరు రైతులు రెండు, మూడు సార్లు విత్తనాలు విత్తుకోవడంతో పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగి పెట్టుబడి భారమైంది. ఈ క్రమంలో పంట రుణాలు రెన్యువల్ చేయించుకునేందుకు అన్నదాతలు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా సొమ్ము చేసుకునేందుకు దళారులు రంగంలోకి దిగారు. అన్నదాతల పేరిట ఉన్న అప్పు చెల్లించి.. మళ్లీ కొత్త రుణం మంజూరు చేయిస్తున్నారు. ఈక్రమంలో వడ్డీ పేరిట నగదు వసూలు చేస్తున్నారు. ఫలితంగా అన్నదాతలు రూ.లక్షల్లో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

బ్యాంకు సేవల కోసం సుదూర ప్రయాణం

ఇల్లెందు మండలంలోని కొమరారం, పోలారం, మాణిక్యారం, మర్రిగూడెం, పోచారంతండా, బోయితండా గ్రామ పంచాయతీల ఆర్థిక కార్యకలాపాలు యూనియన్ బ్యాంకు పరిధిలోకి వస్తాయి. అయితే యూనియన్ బ్యాంకు బ్రాంచ్ ఇల్లెందులోనే ఉండడంతో సుమారు 15 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే తప్ప ప్రజలు బ్యాంకుకు చేరలేరు. ఎటులేదన్నా మూడు, నాలుగు రోజులు పనులు ఆపేసి బ్యాంకుకు వచ్చివెళ్తేనే రుణం రెన్యువల్ పూర్తవుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు గతంలో కొమరారం కేంద్రంగా మినీ బ్యాంకు ఏర్పాటు చేసినా సేవలు ఆచరణలోకి రాలేదు.

పెట్టుబడిదారులదే రాజ్యం

ప్రభుత్వం రైతుబంధు అమలు చేస్తున్నా.. బ్యాంకర్లు పంట రుణాలు అందిస్తున్నా ఇల్లెందు ఏజెన్సీలో పెట్టుబడిదారులదే రాజ్యమైంది. రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నట్లు చెబుతూ పెట్టుబడిదారులే వడ్డీకి నగదు ఇస్తున్నారు. రైతుబంధు ఖాతాల్లో జమ అయినా పాత అప్పుల పేరుతో బ్యాంకర్లు ఖాతాను హోల్డ్‌లో పెట్టడం వంటి కారణాలతో పంట రుణాల కోసం అనివార్యంగా దళారులను ఆశ్రయిస్తున్న రైతులు వారు చెప్పిన వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

అందరికీ తెలిసే..

పంట రుణం కోసం బ్యాంకుల వద్దకు చేరుకుంటున్న రైతులకు దళారుల సహకారం లేనిదే కాసులు చేతికందడం లేదు. దరఖాస్తు మొదలు డబ్బు అందే వరకు దళారులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతులకు సంబంధించిన అప్పు చెల్లించినందున వడ్డీ రూపేణా రోజుకు రూ.వందకు రూ.3 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే, దరఖాస్తు ఫారం నింపడం, పాత రుణం చెల్లింపు, కొత్త రుణం ఇప్పిస్తామంటూ మరికొందరు దండుకుంటున్నారు. ఇవేకాక కొత్త రుణం కోసమైతే ఏకంగా రూ.10 వేలకు పైగానే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కాగా, బ్యాంకుల నిబంధనల మేరకు దళారులను లోపలకు రాకుండా చర్యలు చేపట్టాలి. కానీ, అప్పుల వసూళ్ల లక్ష్యం కారణంగా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసున్నారని తెలుస్తోంది. కాగా, ఈ పరిస్థితి ఇల్లెందులో మాత్రమే కాకుండా అన్ని ప్రాంతాల్లోని బ్యాంకుల వద్ద ఉందని.. రైతుల నుంచి దళారులు అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మా దృష్టికి వచ్చింది..



పంట రుణాల కోసం రైతులు నేరుగా వస్తే సేవలందిస్తాం. కానీ, కొందరు రైతులు అప్పులు చెల్లించలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. వారి సహకారంతో పాత రుణం చెల్లించి కొత్త రుణం తీసుకుంటున్నారు. ఇలాంటి లావాదేవీలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. కానీ, అవన్నీ బ్యాంకు బయటే జరుగుతుండటంతో మేం చర్యలు తీసుకోలేకపోతున్నాం. బ్యాంకులో మాత్రం ఎలాంటి లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

–లోహిత్, బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్, ఇల్లెందు

బీసీలకు అండగా ఉంటా

- మంత్రి అజయ్‌కుమార్
- జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన కృష్ణయ్య



జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కృష్ణయ్య, పక్కన మంత్రి అజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు అండగా ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మమత ఆస్పత్రి రోడ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ తన గెలుపులో ప్రతీసారి బీసీలే ముందుంటారని, ప్రతీ విషయంలో వారికి తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని అన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాధికారంలో ఇప్పటికీ బీసీలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని పేర్కొన్నారు. ఒంట్లో చివరి రక్తపు బొట్టు వరకు బీసీ సమాజ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ బీసీ గురుకులాలు తెచ్చుకున్నామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఆర్జేసీ కృష్ణ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, మోదేపల్లి కృష్ణమాచారి, నీలం వెంకటేశ్, అశోక్, రామకృష్ణ, అన్నవరపు నాగరామాచారి, యమా రవి, లింగబోయిన పుల్లారావు, రామ్మూర్తి, సుగుణ, బ్రహ్మం, రెడ్డిమల్ల వెంకటేశ్వరావు, రాకేష్ దత్త తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణయ్యను వైఎస్సార్ అభిమాని జిల్లేపల్లి సైదులు కలిశారు.

నేడు 'ఎస్‌అండ్ పీసీ ఎంప్లాయీస్' ఎన్నికలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

7 పోస్టులు.. 14 మంది పోటీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ఎస్‌అండ్‌పీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, సెక్రటరీతో పాటు ముగ్గురు డైరెక్టర్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడు పోస్టులకు గాను 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఒక వర్గానికి టీబీజీకేఎస్, బీఎంఎస్, ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్లు మద్దతు పలుకుతుండగా, మరో వర్గాన్ని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ యూనియన్లు బలపరుస్తున్నాయి. సుమారు రూ.12 కోట్ల టర్నోవర్‌తో నడిచే ఈ సొసైటీలో 300 మంది సభ్యులు ఉండగా, వారిలో 215 మంది నేటి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ సంవత్సరమే చేరిన 85 మంది సభ్యులు ప్రస్తుత ఎన్నికల్లో పాల్గొనరాదనే నిబంధనలు ఉండడంతో వారు పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ సొసైటీ కాలపరిమితి ఐదు సంవత్సరాలు ఉంటుంది. గత ఎన్నికలు 2020 మార్చిలో జరిగాయి. అయితే గెలుపొందిన పాలక మండలి అంతర్గత కలహాలతో కొందరు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో 2025లో జరుగాల్సిన ఈ ఎన్నికలను ఇప్పుడే నిర్వహిస్తున్నారు.

గోదావరి @30

భద్రాచలంఅర్బన్: ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల 18న 13 అడుగులుగా ఉన్న నీటిమట్టం, ఈ నెల 22 తేదీన 32.6 అడుగులకు చేరింది. బుధవారం నుంచి తగ్గుముఖం పట్టి సాయంత్రం 5 గంటలకు 30 అడుగులకు చేరింది.

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి

నాబార్డు సీజీఎం సుశీల

అశ్వారావుపేటరూరల్: సేంద్రియ సాగు ఆరోగ్యవంతమైన వ్యవసాయమని, ప్రతీ రైతు దృష్టి పెట్టాలని నాబార్డు సీజీఎం సుశీల పేర్కొన్నారు. మండలంలోని పండువారిగూడెం గ్రామంలో నాబార్డు నిధులతో మల్లాయిగూడెం జీవ కమిటీ, వాసన్ ఆధ్వర్యంలో గోమూత్రం, గోవుపేడ, పుట్టమట్టి, పప్పుదినుసుల పిండి, నీటి మిశ్రమంతో జీవామృతం తయారీ చేసే జీవ వనరుల కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ సాగుతో అశ్వారావుపేటను ఐశ్వర్యపేటగా మార్చుకోవచ్చని సూచించారు. భూమికి పోషకాలు అందించి ఆరోగ్యవంతమైన నేలలుగా మార్చాలని, నేలను కాపాడుకుంటే ముందు తరాల వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుదని వివరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామమైన గోగులపూడిలో పర్యటించి, కొండరెడ్లకు పిండి మిల్లును అందించారు. దేశీయ విత్తనాలు, ఆర్గానిక్ కూరగాయలు, వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో డీజీఎం శ్వేత సింగ్, ఉమ్మడి జిల్లా నాబార్డు అధికారి సుజిత్ కుమార్, స్థానిక ఏజీ కళాశాల ప్రొఫెసర్లు వెంకన్న, రెడ్డి ప్రియ, వాసన్ ప్రతినిధి సతీష్ కుమార్, సభ్యులు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, రాము, దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.



జీవ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల